నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, గురువారం 9 జనవరి 2025 | SURYAPET

## గుట్టలో టీటీడీ ప్రత్యేకాధికారి నియామక జీఓ రద్దు చేయాలి

- మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి డిమాండ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : యాదగిరిగుట్ట దేవస్థానంలో టీటీడీ ప్రత్యేక అధికారిగా గణేశ్ కుమార్ అనే వ్యక్తిని నియమించి, ఆలయం నుంచి జీతాలు ఇవ్వడం తెలంగాణ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసినట్లు ఉందని, వెంటనే జీఓను రద్దు చేయాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం భువనగిరి పట్టణంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గణేశ్ కుమార్ అనే వ్యక్తి చిత్తూరు జిల్లాకు సంబంధించిన వారని, తెలంగాణలో ఉన్న దేవాలయం ఆదాయాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆంధ్రాకు మళ్లించే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.



## నేటి నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- సంక్రాంతికి నల్లగొండ రీజియన్ నుంచి 398 బస్సులు
- ఈ నెల 20 వరకు అందుబాటులోకి..
- ఈ నెల 10, 11న 50 శాతం చార్జీలు పెంపు

నల్లగొండ సిటీ, జనవరి 8 : సంక్రాంతి పండుగ నేపథ్యంలో సొంత గ్రామాలకు వెళ్లేందుకు ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపించేలా ప్రణాళిక రూపొందించింది. ఉమ్మడి నల్లగొండ రీజియన్‌లోని 7 డిపోల పరిధిలో 398 అదనపు బస్సులను నడుపనున్నారు. గత అనుభవాల నేపథ్యంలో ఈ సంక్రాంతికి ముందుగానే ప్రత్యేక బస్సులను నడుపాలని అధికారులు నిర్ణయించారు. నేటి నుంచి ఈ నెల 20 వరకు అదనపు బస్సులను నడుపనున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జాన్‌రెడ్డి తెలిపారు.

### రద్దీకి అనుగుణంగా బస్సులు

ఈ నెల 11 నుంచి విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించగా, ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు తమ సొంత గ్రామాలకు పండుగకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ డిపోల నుంచి రెగ్యులర్ బస్సులతోపాటు అదనపు బస్సులను నడపనున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచనున్నారు.

### అదనపు బాదుడు

పండుగ సందర్భంగా ఈ నెల 10, 11న రద్దీ ఎక్కువగా ఉండనుండగా ప్రయాణికులపై ఆర్టీసీ అదనపు భారాన్ని మోపనుంది. అదనపు బస్సుల్లో 50 శాతం మేర చార్జీలు పెంచనుంది. ఉచిత బస్సులను తగ్గించి మరో రూపంగా ప్రయాణికులను దోచేందుకు ఆర్టీసీ సన్నద్ధమైనట్లు తెలుస్తున్నది.

### రిజర్వేషన్ కూడా చేసుకోవచ్చు....

పండుగకు ఆర్టీసీ నడిపే అదనపు బస్సుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం ముఏందుగానే రిజర్వేషన్ చేసుకునేందుకు వీలు కల్పించారు. సొంత జిల్లాలకు వెళ్లి వచ్చే ప్రయాణికులు WWW. tgsrtcbus.in వెబ్‌సైట్ ద్వారా సీట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చు. దాంతో పాటు ఆయా పరిధిలోని బస్టాండ్‌లో కూడా రిజర్వేషన్ చేసుకోవచ్చని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

### డిపోల వారీగా అదనపు బస్సులు

| | |
|---|---|
| నల్లగొండ | 66 |
| మిర్యాలగూడ | 70 |
| సూర్యాపేట | 93 |
| దేవరకొండ | 57 |
| నార్కట్‌పల్లి | 20 |
| యాదగిరిగుట్ట | 62 |
| కోదాడ | 30 |

### ప్రయాణికులను సురక్షితంగా చేర్చడమే లక్ష్యం



ఉమ్మడి జిల్లాతోపాటు హైదరాబాద్ నుంచి ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందనే నేపథ్యంలో అదనపు బస్సులను ఏర్పాటు చేశాం. ఉమ్మడి జిల్లాని 7 డిపోల నుంచి తదితర ప్రాంతాలకు బస్సులు నిరంతరం ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. ప్రయాణికులను సురక్షితంగా తమ సొంత ఊర్లకు చేరవేయడమే ఆర్టీసీ లక్ష్యం.

-జాన్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం

# అక్రమార్కుల గుండెల్లో గుబులు

**'అగరు వనం ఆరగింత' కథనంతో కలకలం**

- కొలనుపాక భూముల కేసులో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్
- అడ్డగోలుగా చేసిన 154 అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దయ్యేనా?
- ఆగమేఘాల మీద భూ యాజమానుల ప్రెస్‌మీట్
- విలేకరుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన వైనం

**ఆలేరు మండలం కొలనుపాకలో గల అగరు వనం వెంచర్‌లో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. నమస్తే తెలంగాణ ప్రధాన సంచికలో బుధవారం 'అగరు వనం ఆరగింత' శీర్షికతో ప్రచురితమైన కథనంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు మొదలైంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి వివాదం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఎక్కడ చూసిన ఆయన భూ అక్రమాలపైనే చర్చ జరుగుతున్నది. బినామీల పేర్లతో భూములు కొల్లగొట్టిన తీరుపై చర్చించుకుంటున్నారు. కొలనుపాక గ్రామ రెవెన్యూ ప్రాంతంలో సర్వేనంబర్ 472, 473లో మొత్తం 7.27 ఎకరాల భూమిలో అక్రమంగా 154 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసినట్లు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, వెంచర్ యాజమాని జంగయ్య యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రిజిస్ట్రార్, అండ్ స్టాంప్స్ విభాగం డీఐజీ మధుసూధన్, ఆడిట్ అధికారి అశోక్ ఉమ్మడి నల్లగొండ జిల్లా సబ్ రిజిస్ట్రార్ హరికోట్ల రవి కలిసి యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం తనిఖీ చేశారు. ఆన్‌లైన్ కంప్యూటర్లను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసిన్నట్లు తేల్చారు. ఇందులో పాలుపంచుకున్న ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ గోపి నాయన్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. సబ్ రిజిస్ట్రార్ తనిఖీ, సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్ వ్యవహారంతో 'నమస్తే తెలంగాణ' కథనం నిజమేనని రుజువు చేసింది. ఇందులో ప్రధానంగా ఆ ప్రజాప్రతినిధి వెనుక ఉండి తతంగాన్ని నడిపించినట్లు పలువురు చర్చించుకుంటున్నారు.**

– యాదగిరిగుట్ట, జనవరి 8


యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కంప్యూటర్‌లో చెక్ చేస్తున్న రిజిస్ట్రార్, అండ్ స్టాంప్స్ విభాగం డీఐజీ మధుసూధన్, ఆడిట్ అధికారి అశోక్, ఉమ్మడి నల్లగొండ జిల్లా సబ్ రిజిస్ట్రార్ హరికోట్ల రవి

**154 మంది బినామీల పేరిట..**

కొలనుపాక గ్రామంలో సర్వే నంబర్ 472, 473లో మొత్తం 7.27 ఎకరాల భూమిని తన సదరు ప్రజా ప్రతినిధి తన అనుచరుల పేరిట గతేడాది డిసెంబర్ 17న సేల్ డీడ్ చేశారు. ఆయానో భయానో ఆలేరు తాసీల్దార్‌ను మేనేజ్ చేసుకుని డీటీసీపీ అనుమతులు లేకుండా, ఒకగుంట మాత్రమే నాలా కన్వర్షన్ చేసి మిగతా ప్లాట్లు కన్వర్షన్ లేకుండానే రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏకంగా 154 మంది బినామీల పేరిట ఒక్కొక్కరికి గుంట, రెండు గుంటలు ఓపెన్ ప్లాట్లుతో రిజిస్ట్రేషన్ చేశారు. సర్వే నంబర్ 472లో గతేడాది 20న 35ప్లాట్లు, 21న 22 ప్లాట్లు, 22న 12 ప్లాట్లు, సర్వే నంబర్ 473లో డిసెంబర్ 20న 16 ప్లాట్లు, 21న 30 ప్లాట్లు, 23న 41 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ వ్యవహారమంతా గుట్టుచప్పుడు కాకుండా జరిగిందని భావించినా నమస్తే తెలంగాణలో కథనం రావడంతో ఆయన భూ అక్రమం దందా బట్టబయలైంది. ఆ ప్రజా ప్రతినిధి వ్యవహారంపై ఇంటెలిజెన్స్ ఆరా తీస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ వ్యవహార తీరుపై సదరు ప్రజాప్రతినిధి తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. దిద్దుపాటు చర్యలకు పూనుకున్నాడని, భూ యాజమానులతో బేరసారాలకు దిగిన్నట్లు తెలుస్తున్నది. ఈ వ్యవహారాన్ని చక్క పెట్టాలని ఆయన తోటి తిరిగే ముఖ్య నాయకులకు బాధ్యతలకు ఇచ్చినట్లు పార్టీ వర్గాలు గుసుగుసలాడుతున్నాయి. తనపై వచ్చిన ఆరోపణలను తీవ్రంగా ఖండించాలని తన అనుచరగణానికి హుకూం జారీ చేసినట్లు సమాచారం. అయితే నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసిన 154 ప్లాట్లు రద్దు చేస్తారన్న చర్చ సాగుతున్నది. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేశారంటే కచ్చితంగా డ్యాకుమెంట్లు సైతం రద్దయ్యే అస్కారం ఉందని పలువురు భావిస్తున్నారు.

### ఆరోపణలను ఖండించే ప్రయత్నం

సదరు ప్రజాప్రతినిధి పైన వచ్చిన ఆరోపణను ఖండించేందుకు భూ యాజమానులు ఆగమేఘాల మీద యాదగిరిగుట్ట పట్టణంలో ప్రెస్‌మీట్ పెట్టారు. అగరు వనం వెంచన్ యాజమాని జంగయ్య యాదవ్, తన పార్ట్‌నర్స్ సంతోష్ లోయ, ఏఎస్ రెడ్డిలతో కలిసి ఆరోపణలను ఖండించే ప్రయత్నం చేశారు. తాము తీన్మార్ మల్లన్నలను కలువలేదని, తమను ఎవరూ భయపెట్టలేదని, తమ పార్ట్‌నర్స్ మధ్యలో గొడవలున్నాయని చెప్పారు. తమపై వచ్చిన కథనంలో నిజం లేదన్నారు. కానీ ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు ప్రజాప్రతినిధి ఎవరు అని విలేకరులు అడుగగా వారు దాటవేశారు. 154 ప్లాట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేశారు కదా అని అడుగగా, తాము కస్టమర్లకు మాత్రమే విక్రయించామని, ప్రజాప్రతినిధి అనుచరుల పేరిట రిజిస్ట్రేషన్ చేయలేదని తెలిపారు. కాగా తీన్మార్ మల్లన్నను కలిసి జంగయ్యాయాదవ్ విన్నవించుకోగా సమగ్ర విచారణ చేపట్టి తగు న్యాయం చేయాలని రిజిస్ట్రేషన్, అండ్ స్టాంప్స్ కమిషనర్ జ్యోతి బుద్ధా ప్రకాశ్‌కు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లను రాసిన లెటర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.


కన్నెకల్ –ముషంపల్లి రోడ్డుపై తాటి చెట్లు అడ్డం వేసి రాస్తారోకో చేస్తున్న రైతులు

## సాగునీటి కోసం రైతుల రాస్తారోకో

మాడ్గులపల్లి, జనవరి 8 : సాగునీటి కోసం మండలంలోని కన్నెకల్ – ముషంపల్లి రోడ్డుపై రైతులు బుధవారం తాటి చెట్లు వేసి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఎస్‌ఎల్‌బీసీ 24ఆర్ కాల్వ నుంచి చెరువులోకి పంట సాగు కోసం తీసే కాల్వను ఓ రైతు తీయకుండా ఆపుతున్నాడని, ఈ కాల్వ తీస్తే నాలుగు చెరువులు పుష్కలంగా నిండుతాయని అన్నారు. గత వేసవిలో సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డామని, అదే డీ–37 కాల్వ 24ఆర్ ద్వారా రెండు తూములు వస్తున్నాయని, మూడో తూము తీయాలనుకుంటే పక్కనే ఉన్న రైతు తీయనీయడం లేదని, గతంలో ఆ రైతుకు భూమి పోయినందున ప్రభుత్వం కొంత ఆర్థిక సహాయం చేసిందని తెలిపారు. కాల్వ తీయకపోవడంతో తాము రోడ్డుపై నిరసనకు దిగాల్సి వచ్చిందన్నారు. విషయం తెలుసుకున్న నిడమనూరు పోలీసులు అక్కడికి చేరుకొని రైతులకు సర్ధిచెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.


ముంపు బాధితులకు ప్లాట్లు కేటాయిస్తున్న అడిషనల్ కలెక్టర్ జె.శ్రీనివాస్

## నర్సిరెడ్డిగూడెం ముంపు బాధితులకు ప్లాట్ల కేటాయింపు

- 289 భూ నిర్వాసితులకు 257 మందికే ప్లాట్లు
- ప్లాట్లు రాని 32మంది ఆందోళన

మర్రిగూడ, జనవరి 8 : శివన్నగూడెం ప్రాజెక్టు నిర్మాణంలో నర్సిరెడ్డిగూడెం, చర్లగూడెం, వెంకెపల్లి, వెంకెపల్లి తండా గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. పునరావాసం కల్పించాలని నిర్వాసితులు ఆందోళన ఉధృతం చేస్తుండటంతో మొదటగా నర్సిరెడ్డిగూడెం భూనిర్వాసితులకు చింతపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా టెంపుల్ దగ్గర సర్వే నంబర్ 154లో 289 ప్లాట్లను ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. బుధవారం చింతపల్లి మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో లేఅవుట్ ఆధారంగా అడిషనల్ కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి సమక్షంలో ప్లాట్లను కేటాయించారు. గ్రామంలోని 257 మంది భూ నిర్వాసితులకు 240 చదరపు గజాల చొప్పున డ్రా పద్ధతిలో ప్లాట్లను కేటాయించారు. కార్యక్రమంలో మర్రిగూడ, చింతపల్లి తాసీల్దార్లు బక్క శ్రీనివాసులు, రమాకాంత్ శర్మ, ఇరిగేషన్ ఈఈ రాములు నాయక్, డీఈఈ ఖాసీం పాల్గొన్నారు.

### ప్లాట్లు ఇవ్వకపోవడంతో నిర్వాసితుల ఆందోళన

నర్సిరెడ్డిగూడెంలో 289మంది నిర్వాసితులకు ప్లాట్లను కేటాయించాల్సి ఉండగా అధికారులు 257 మందికే ఇచ్చారు. మిగతా 32మందికి ప్లాట్ల కేటాయింపు జరుగకపోవడంతో వారు ఆందోళన చేశారు. మమ్మల్ని ఎందుకు పిలిపించారని, తమకు కూడా ప్లాట్‌లు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. తమ గ్రామస్తులతో పాటు తమకు కూడా ఇదే స్థలంలో ప్లాట్లు కావాలని అధికారులతో వాగ్వాదానికి దిగారు. తప్పనిసరిగా ప్లాట్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడంతో ఆందోళన విరమించారు.

## మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం


చౌటుప్పల్‌లో మరమ్మతులు చేపడుతున్న ప్రదేశం

చౌటుప్పల్, జనవరి 8 : పట్టణంలోని వలిగొండ క్రాస్ రోడ్డు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా చౌటుప్పల్ మండల పరిధిలోని తాళ్లసింగారం, నేలపట్ల, చిన్నకొండూర్, వలిగొండ మండలంలోని వర్కట్‌పల్లి ఓహెచ్‌బీఆర్‌లకు నీటి సరఫరా నిలిచిపోతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.లక్ష్మీనారాయణ బుధవా రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9, 10, 11తేదిల్లో నీటి సరఫరా చేసే పైపులైన్ మరమ్మతుల కారణంగా ఓహెచ్‌బీఆర్‌ల పరిధిలోని 28 అవాసా గ్రామాలైన ఆరెగూడెం, కాట్రేవు, పంతంగి, గుండ్లబావి, రెడ్డిబావి, తుంబావి, సైదాబాద్, అంకిరెడ్డిగూడెం, జిల్లెడుచెల్క, ఎస్.లింగోటం, జైకేసారం, అస్సోనిగూడెం, చౌటబావిగూడెం, పెద్దబావిగూడెం, నేలపట్ల, కుంట్లగూడెం, మందోళ్లగూడెం, తూర్పుగూడెం, సింగారాయచెర్వు, చిన్నకొండూర్, నక్కలగూడెం, తంబల్లోని బావి, గుడ్డోని బావి, వెంకటబావి, మసీదుగూడెం, శేరీల్లా తదితర గ్రామాలకు నీటి సరఫరాలో అంతరాయం కలుగనుందని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం ఆయా గ్రామాల గ్రామపంచాయతీ సి బ్బంది ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని కోరారు.

## రాష్ట్ర స్థాయి అండర్-19 హాకీ పోటీల్లో నల్లగొండ విన్నర్

- రన్నరప్‌గా మహబూబ్‌నగర్ జట్టు


హాకీ జట్లతో అధికారులు, ప్రజాప్రతినిధులు

నల్లగొండ రూరల్, జనవరి 8 : నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో బుధవారం 68వ రాష్ట్ర స్థాయి అండ ర్ –19 హాకీ జాతీయ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీల్లో వరంగల్, నల్లగొండ, కరీంగనర్, ఆదిలాబాద్, నల్లగొండ, మెదక్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జట్లు పాల్గొన్నాయి. విజేతగా నల్లగొండ జట్టు, రన్నరప్‌గా మహబూబ్‌నగర్ జట్టు నిలిచాయి. పోటీల ప్రారంభోత్సవంలో డీఈఓ భిక్షపతి. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ మున్సిపల్ చైర్మన్ అబ్బగోని రమేశ్, జిల్లా క్రీడల, యువజన అధికారి కుంభం నర్సిరెడ్డి, ఎస్‌జీఎఫ్ అండర్ –19 కార్యదర్శి ఇందిర, స్కూల్ గేమ్స్ కార్యదర్శి విమల, హాకీ అసోసియేషన్ కార్యదర్శి ఇమామ్ కరీం, పీఈటీలు వి.రవీందర్, ప్రభావతి, గుండా శ్రీను ,కరుణాకర్‌రెడ్డి, ధర్మేందర్, సురేందర్‌రెడ్డి, చందు, పృథ్వీ పాల్గొన్నారు.

# తరుగు.. తడిసిన ధాన్యం పేరుతో దోపిడీ

## గత యాసంగి అక్రమాలు వెలుగులోకి..

## కుమ్మక్కైన కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు


నల్లగొండలోనీ డీసీఓ ఆఫీసులో చెక్కుల కోసం ఎదురుచూస్తున్న తేరటిపల్లి రైతులు

- నల్లగొండ జిల్లాలో 2వేల క్వింటాళ్ల దోపిడీ.. రూ.5 కోట్లు అక్రమార్కుల జేబుల్లోకి
- అన్నీ సక్రమంగా ఉన్నా కోతలు ఎందుకు పెట్టారంటున్న రైతులు
- పది నెలలుగా ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు
- క్వింటాలోపు నష్టపోయిన రైతులు తిరగలేక వదిలేసిన పరిస్థితి

**తరుగు, తడిసిన ధాన్యం పేరుతో రైతులను అక్రమార్కులు నిలువునా ముంచారు. మిల్లర్లు, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కుమ్మక్కై ధాన్యం నొక్కేశారు. గత యాసంగిలో నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 2వేల క్వింటాళ్ల దోపిడీ చేశారు. వాటి విలువ సుమారు రూ.5 కోట్లు ఉంటుంది. కోత కోసిన ధాన్యాన్ని కొంత మిల్లర్లు కాజేయగా, మిగతా ధాన్యం కేంద్రాల నిర్వాహకులు పలువురు రైతుల పేరిట వేయించుకొని బ్యాంకు ఖాతాల్లో జమ చేయించుకున్నారు. ధాన్యం కోతలపై జరిగిన అక్రమాలపై ఎక్కువ మొత్తంలో నష్టపోయిన పలువురు రైతులు గుర్తించి అధికారుల చుట్టూ తిరిగారు. కానీ క్వాంటా, అర క్వింటాలు నష్టపోయిన రైతులు మాత్రం పట్టించుకోలేదు. అన్నీ సక్రమంగా ఉండి కోతలు ఎలా కోస్తారని అధికారులను నిలదీస్తూ పది నెలలుగా పోరాటం చేయగా బుధవారం కొంత మంది రైతులకు కొంత మంది డబ్బులు చెల్లించి, మిగతా వారికి తర్వాత ఇస్తామని చెప్పి అధికారులు చేతులు దులుపుతున్నారు. ప్రధానంగా నల్లగొండ, నకిరేకల్, నియోజకవర్గాల్లో ఈ మోసం ఎక్కువగా జరగ్గా దేవరకొండ, నాగార్జున సాగర్, మిర్యాలగూడలోనూ పాక్షికంగా జరిగిందని ఆరోపణలు వస్తున్నాయి.**

– నల్లగొండ, జనవరి 8

**ధాన్యం మిల్లులకు చేరాక మోసం..**

గత యాసంగిలో ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాలో 370 కేంద్రాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులు సుమారు రూ.1.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నారు. కొన్న ధాన్యం లిఫ్టింగ్ చేశాక ధాన్యం తడవడంతో మిల్లర్లు తీసుకోవటం లేదని, కోతలు పెడతున్నారని, లేదంటే మీరే తీసుకొని ఎక్కడికైనా వెళ్లి అమ్ముకొమ్మని నిర్వాహకులు రైతులను భయపెట్టారు. పెద్ద రైతులకైతే క్వింటా నుంచి మూడు క్వింటాళ్ల వరకు, చిన్న రైతులకైతే అర క్వింటా నుంచి క్వింటా వరకు మిల్లుల్లో కోతలు కోశారట. కొంత మంది రైతులు ఏంచేస్తామని మిన్నకుండా ఊరుకోగా, మరికొంది మంది రైతులు అన్నీ సక్రమంగా ఉన్నా కోతలెందుకు కోశారని, తమ ధాన్యం డబ్బులు తిరిగి ఇవ్వాలని పది నెలలుగా సంబంధిత ఆఫీసుల చుట్టు తిరిగినా ఫలితం లేకుండా పోయింది. అయితే కోసిన కోతలో కొంత భాగం మిల్లర్లు తీసుకోగా మరి కొంత భాగం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే వారికి భూములు ఉంటే వారి పేరుతో, లేకుంటే మరో సానుభూతిపరులతో పేరుతో డబ్బులు నొక్కేయడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా ఇలా పలు కేంద్రాల్లో రెండు వేల క్వింటాళ్లకు పైనే దోపిడీ చేసినట్లు సమాచారం. క్వింటాకు రూ.2,300 చొప్పున సుమారు రూ.5కోట్లు అన్నదాతకు కుచ్చుటోపీ పెట్టారు.

### పదినెలల తర్వాత పావలా వంతు పైసలిచ్చి..

గుర్రంపోడు మండలంలోని తేరటిగూడెం, కొప్పోలు, చామలోని బాయి గ్రామానికి చెందిన సుమారు వంద మంది రైతులకు ఇదే పరిస్థితి ఏర్పడింది. జక్కలి నర్సింహ అనే పెద్ద మనిషి గమనించి పది నెలలు పోరాటం చేసి ఆ ఊరు రైతులను జిల్లా సహకార ఆఫీసు దగ్గర కూర్చోబెట్టాడు. ఒక్కో రైతు నుంచి అర క్వింటా నుంచి రెండు క్వింటాళ్ల దాకా సుమారు వంద క్వింటాళ్ల ధాన్యం తడిసిందనే సాకుతో మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తరుగు తీశారు. కోత కోసిన తమ ధాన్యం డబ్బులు ఇవ్వకుంటే ఊరుకునేది లేదని చెప్పడంతో సుమారు రూ.25లక్షలకు గానూ బుదవారం రూ.9.20లక్షలు ఇస్తామని చెప్పారు. కానీ అది కూడా అందరికీ ఒక్కరోజే ఇవ్వమని చెప్పి మొదటగా 20మందికి ఇచ్చి దులుపుకొన్నారు. నష్టపోయిని తాము మాత్రమే బయటకు వచ్చామని, ఇంకా మా గ్రామంలో చాలా మంది ఉన్నారని రైతులు అనడం గమనార్హం.

### రెండున్నర క్వింటాళ్లు కోత కోశారు



నేను మా గ్రామం లో నాకున్న భూమిలో అరకొర నీళ్లతో ఎకరం సాగు చేస్తే అందులో 30 బస్తాలు కూడా పండలేదు. దానికే ఎంతో ఇబ్బంది పడా ల్సి వచ్చింది. అయినా నాకు ఆరు బస్తాలు అంటే రెండున్నర క్వింటాళ్లు కోత కోశారు. అదేమని అడిగితే నీ ధాన్యం తడిసిందని చెప్పి అదరకొట్టారు. నా డబ్బులు నాకివ్వాల్సిందే అని పది నెలులుగా తిరిగితే ఇవ్వాల సగం డబ్బులు కూడా ఇవ్వలేదు.

- చీకూరు శ్రీను, తేరటి పల్లి, గుర్రంపోడు మండలం

### మా కొనుగోలు కేంద్రం వ్యక్తే ఇదంతా చేశాడు



నేను ఎకరం భూమిలో వరి సాగు చేస్తే 50 బస్తాలు పండింది. అందులో నాలుగు బస్తాలు తరుగు తీశారు. ఇదేందని మా ఊర్ల పెద్ద మనిషి అయిన జక్కలి నర్సింహని కలిస్తే రైతులందరినీ జమచేసి ఆఫీసుల దగ్గరకు తీసుకుపోయిండు. నెలల కొద్ది తిరిగితే ఇయ్యాల చార్జీల ఖర్చులు కూడా రాలేదు. మా సొమ్ము మాకు ఇవ్వడానికి కూడా ఇంత మోసమా. మేము పంట పండించడానికి ఎంత ఇబ్బంది పడ్డామో వాళ్లకేం తెలుసు.

-నారబోయిన యాదయ్య, తేరటిపల్లి, గుర్రంపోడు మండలం